రైల్వేలో కవచ్‌ను వేగంగా విస్తరించాలి

రైల్వే బోర్డు డైరెక్టర్ జనరల్ ఆర్ రాజగోపాల్



లాలాపేట: ఇండియన్ రైల్వేస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సిగ్నల్ ఇంజనీరింగ్ అండ్ టెలీ కమ్యూనికేషన్ (ఇరిసెట్)ను శుక్రవారం రైల్వే బోర్డు మానవ వనరుల డైరెక్టర్ జనరల్ ఆర్. రాజగోపాల్ సందర్శించారు. ఈ సందర్భంగా ఇరిసెట్ డైరెక్టర్ జనరల్ శరద్‌కుమార్ శ్రీవాస్తవ ఇతర అధికారులతో కలసి ఇరిసెట్‌లోని ఆయా విభాగాల పనితీరును, శిక్షణా కార్యక్రమాలను ఆయనకు వివరించారు. భారతీయ రైల్వేలో కవచ్‌ను అమలు చేస్తున్న పరిజ్ఞానానికి ఇరిసెట్‌లో అధికారులు, సూపర్‌వైజర్లు, సంస్థ ఉద్యోగులు, సిబ్బంది చేస్తున్న కృషిని తెలియజేశారు. దీంతో పాటుగా ఇరిసెట్‌లో శిక్షణ పొందుతున్న ట్రైనీ అధికారులతో ముఖాముఖి నిర్వహించారు. రైల్వేలో కవచ్‌ను మరింత పటిష్టంగా, వేగంగా విస్తరించాల్సిన ఆవశ్యకతపై రాజగోపాల్ ట్రైనీ అధికారులతో మాట్లాడారు. కవచ్ లాబొరేటరీలోని పరికరాలను సందర్శించారు. కార్యక్రమంలో రైల్వే బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినీత్ పాండే, ఇరత విభాగాల అధికారులున్నారు.

బల్కంపేట ఎల్లమ్మ వద్ద ఉచిత వైద్య శిబిరం

అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ ఆలయం ఆవరణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వేదస్థానం పాలక మండలి సభ్యులు హరిదేవ రాయ చౌదరి ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన శిబిరంలో చర్మ, దంత, నేత్ర పరీక్షలతో పాటు బీపీ, షుగర్ వంటి పరీక్షలు చేశారు. ఆలయంలో పనిచేసే సిబ్బంది, భక్తులు, సాధారణ ప్రజలు సుమారు 400 మంది వరకు శిబిరంలో కావాల్సిన పరీక్షలు చేయించుకొన్నారు. సీజనల్ వ్యాధులపై వైద్యులు అవగాహన కల్పించారు.

క్యాంపస్ నియామకాల్లో 130 మంది విద్యార్థులు

లాలాపేట: ఉస్మానియా యూనివర్సిటీ హ్యూమన్ క్యాపిటల్ డెవలప్మెంట్ సెంటర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఓయూలోని సీఎఫ్ఆర్‌డీ భవనం ఈ క్లాస్ రూంలో ఎంఎస్ఎన్ లాబోరేటరీస్ క్యాంపస్ నియామక డ్రైవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని హెచ్‌సీడీసీ డైరెక్టర్ ప్రొఫెసర్ విజయా చరణ్, కోఆర్డీనేటర్ డా.యూ. సూర్య వల్లి ప్రారంభించారు. అనంతరం ఈ డ్రైవ్‌లో దాదాపు 130 మంది ఎమ్మెస్సీ విద్యార్థులు పాల్గొన్నారు. వారికి ప్రీ–ప్లేస్‌మెంట్ టాక్, రాత పరీక్ష, టెక్నికల్ రౌండ్స్ తదితర పరీక్షలు నిర్వహించారు. ఇందులో ఎంపికైన విద్యార్థుల జాబితాను త్వరలో ప్రకటిస్తామని ఎంఎస్ఎన్ లాబోరేటరీస్ ప్రతినిధులు తెలిపారు.

ఫీజుల పేరుతో వేధించొద్దు

లాలాపేట: ఉస్మానియా యూనివర్సిటీలో పీజీ సెకండ్ ఇయర్ విద్యార్థుల హాస్టల్, మెస్, కాలేజీ రెన్యూవల్ పేరుతో ఫీజులు వసూలు చేసే పద్ధతిని విరమించుకోవాలని జార్జిరెడ్డి పీడీఎస్‌యూ నేతలు డిమాండ్ చేస్తున్నారు. శుక్రవారం ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేష్‌రెడ్డిని, ఓఎస్డీ ప్రొఫెసర్ జితేందర్ నాయక్‌ను, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్ తదితరులను కలిసి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో జార్జిరెడ్డి పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి సుమంత్, గర్ల్స్ కన్వీనర్ కె.స్వాతి, గ్రేటర్ అధ్యక్షుడు వెంకటేష్, ఓయూ నాయకులు విజయ్‌కుమార్, బాలకృష్ణ తదితరులున్నారు.

ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు

అమీర్‌పేట: ఫుట్‌పాత్‌లు ఆక్రమించి ప్రజలను ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు ఉంటాయని దుకాణ యజమానులను పోలీసులు హెచ్చరించారు. ఎస్ఆర్‌నగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బాపూనగర్ యూనియన్ బ్యాంక్ లైన్‌లో పోలీసులు ఆపరేషన్ రోప్ వే నిర్వహించారు. ఎస్ఐ నాగరాజు ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసి ఉన్న ఆక్రమణలను తొలగించారు.

అధ్యాపకులకు సత్కారం

సనత్‌నగర్: తులసీభవన్ డివోషనల్ లిటరరీ, కల్చరల్ స్టడీస్ ఆధ్వర్యంలో బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన ముగ్గురు అధ్యాపకులను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని సదరు సంస్థ ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసి శుక్రవారం త్యాగరాయ గానసభలో జరిగిన కార్యక్రమంలో వారిని సత్కరించారు. డాక్టర్ కిషన్ (తెలుగు విభాగం), డాక్టర్ కే వెంకటేశ్వర్లు (సంస్కృత విభాగం), అఫ్సరున్నీసాబేగం (హిందీ విభాగం)లను ఉత్తమ అధ్యాపకులుగా సత్కరించి జ్ఞాపికలను అంజదేశారు. దీనికి తెలంగాణ ఉన్నత విద్యాశాఖ వైస్ చైర్మన్ పురుషోత్తమ్ వీరిని సన్మానించారు.

కాంగ్రెస్ నేతల నిరసన

సనత్‌నగర్: టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి డాక్టర్ కోట నీలిమకు ఎన్నికల కమిషన్ ఆఫ్ ఇండియా నోటీసులు జారీ చేయడంపై కాంగ్రెస్ శ్రేణులు వినూత్న నిరసన చేశారు. బేగంపేట ఓల్డ్‌కస్టమ్స్‌బస్తీ సమీపంలోని పోచమ్మ ఆలయంలో హోమం, పూజలు నిర్వహించి ఎన్నికల కమిషన్ ఆఫ్ ఇండియాకు దేవుడు సరైన బుద్ధి ప్రసాదించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైళ్లు.. రాళ్లు

- ట్రాక్ పరిసర ప్రాంతాల్లో పెద్దలతో ప్రతిజ్ఞలు
- పిల్లలకు జరిమానాలు, శిక్షలపై అవగాహన
- రాళ్లు రువ్వే ఘటనలు నియంత్రించేందుకు చర్యలు
- ప్రత్యేక దృష్టి సారించిన ఆర్‌పీఎఫ్ బృందాలు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఆర్‌పీఎఫ్ పోలీసులు

సికింద్రాబాద్: మహానగరం అంతా రైల్వేట్రాక్‌లు, వంతెనలతో ఆవరించి ఉంది. సికింద్రాబాద్ నుంచి మరో చోటికి వెళ్లాలన్నా రైల్వేలైన్లు, వంతెనలు దాటుకొని వెళ్లక తప్పదు. ఇక్కడి రైల్వే లైన్లను ఆవరించి ఉన్న పలు బస్తీలకు చెందిన ఆకతాయిలు రైళ్ల రాకపోకల సమయంలో సరదా కోసం రాళ్లు విసురుతున్నారు. దీంతో ప్రయాణికులకు గాయాలు అవుతున్నాయి. రాళ్ల దెబ్బలకు బోగీలకు సంబంధించిన పలు ఎక్స్‌ట్రా ఫిటింగ్‌లు దెబ్బతింటున్నాయి. ఒక వైపు రాళ్లు విసిరిన ఆకతాయిలను పట్టుకొని కేసులు నమోదు చేస్తూనే మరో వైపు ఇటువంటి ఘటనలు జరగకుండా ఉండేందుకు రైల్వే ట్రాక్‌ను ఆవరించి ఉన్న జనవాసాల ప్రజలు, విద్యార్థులకు సికింద్రాబాద్ డివిజన్ రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ్) బృందాలు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

ఆర్‌పీఎఫ్ ప్రత్యేక చర్యలివీ..

- నడుస్తున్న రైళ్లపై రాళ్లు రువ్వే ఘటనలు తరచూ జరుగుతుండడం, ప్రయాణికులు గాయపడుతుండడం, భయభ్రాంతులకు గురవుతున్న నేపథ్యంలో సికింద్రాబాద్ డివిజన్ ఆర్‌పీఎఫ్ పోలీసులు బస్తీల్లో పర్యటించే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఆయా బస్తీల్లోని పిన్నలు, పెద్దలందరికీ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.
- సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి నిత్యం వందలాది రైళ్లు, వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. ఆటువంటి ఘటనల్లో సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు గాయాలు తగిలితే రైల్వే ప్రతిష్టకు భంగం వాటిల్లే ప్రమాదం ఉన్న నేపథ్యంలో ప్రతిజ్ఞలు, అవగాహన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.

పిన్నలకు.. పెద్దలకు..

- బస్తీల పెద్దలను సమావేశపరిచి రైళ్లపై రాళ్లు రువ్వడం నేరమని చెప్పారు. దీంతో నిందితులు ఎదుర్కొనే చట్టపరమైన చర్యలను వివరించారు. తాము రైళ్లపై రాళ్లు రువ్వే చర్యలకు దూరంగా ఉంటామని, వేరే వ్యక్తులు రాళ్లు రువ్వినా బాధ్యతగా ఆర్‌పీఎఫ్ పోలీసులకు సమాచారం అందిస్తామని వారితో ప్రతిజ్ఞ చేయించారు.
- ఆయా ప్రాంతాల పాఠశాలలు సందర్శించి ఆర్‌పీఎఫ్ పోలీసులు విద్యార్థులకు రైళ్లపై రాళ్లు రువ్వడం ద్వారా జరిగే నష్టాలను తెలియజేశారు. అదేవిధంగా పిల్లలకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

సిబ్బంది కొరతే అసలు సమస్య

- సికింద్రాబాద్ ప్రాంత ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా 260మంది ఆర్‌పీఎఫ్ పోలీసులు అవసరం ఉంది. ప్రస్తుతం 118 మంది మాత్రమే ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నారు. రైల్వేస్టేషన్లలో పహారాలు కాయడం, రైల్వే ఆస్తులను కాపాడడంతో పాటు రైళ్లపై రాళ్లు రువ్వుతున్న ఆగంతకులను ఎప్పటికప్పుడు పట్టుకోవడం కష్టసాధ్యం అవుతుంది. ఈ నేపథ్యంలో సికింద్రాబాద్ డివిజన్ ఆర్‌పీఎఫ్ పోలీసులు కూడా ఫ్రెండ్లీ పోలీస్ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఆర్‌పీఎఫ్ పోలీసులు నేరుగా తమ బస్తీలకు రావడం, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుండడంతో రైల్వేట్రాక్‌లను ఆవరించి ఉన్న బస్తీ ప్రజల నుంచి సానుకూలత లభిస్తుందని ఆర్‌పీఎఫ్ అధికారులు పేర్కొంటున్నారు.



ప్రజలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్‌పీఎఫ్ పోలీసులు

రాళ్లు రువ్వితే తీవ్రమైన శిక్షలు

రాళ్లు రువ్వి రైల్వే ఆస్తులను ధ్వంసం చేయడం, ప్రయాణికులను గాయపర్చడం వంటి ఘటనల్లో నిందితులపై తీవ్రమైన చర్యలు ఉంటాయి. ముఖ్యంగా యువకులపై కేసులు నమోదైతే జరిమానా, జైలుశిక్షతో పాటు ప్రభుత్వ ఉద్యోగాలకు దూరం అవుతారు. ఈ ఏడాది దక్షిణమధ్య రైల్వే పరిధిలో 102 మందిని ఆర్‌పీఎఫ్ పోలీసులు అరెస్టు చేశారు. ఎక్కువ మంది నిందితులకు ఐదేళ్లపైబడిన శిక్షలు అమలయ్యాయి. ప్రయాణికుల సౌలభ్యం కోసం నడుస్తున్న రైల్వేల భద్రతకు ప్రజలు సహకరించాలి.

– బీఎస్ సారస్వత్ ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్

ప్రజల సమస్యల కోసం పోరాడుతాం

సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్



మెట్టుగూడలో సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్, కార్పొరేటర్ సునీత

సికింద్రాబాద్: ప్రభుత్వం ఏదైనా తాము ఎప్పుడు నియోజకవర్గ ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తానని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్ తెలిపారు. శుక్రవారం మెట్టుగూడ డివిజన్‌లో రూ.125 కోట్ల అంచనా వ్యయంతో పలు అభివృద్ధి పనులు ఆయన ప్రారంభించారు. రూ.70 లక్షలతో మెట్టుగూడ కూడలి, విజయపురి కాలనీలో సీసీరోడ్ల నిర్మాణం, రూ.48 లక్షలతో ఓపెన్ జిమ్, రూ.7లక్షలతో మెట్టుగూడలో కూడలి సుందరీకరణ పనులను కార్పొరేటర్ రాసూరి సునీతతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో ఎప్పుడు జరగనన్ని అభివృద్ధి పనులు పూర్తిచేశామని చెప్పారు. ప్రస్తుతం ప్రభుత్వ మారినప్పటికీ ప్రజల సమస్యల పరిష్కారం కోసం అండగా ఉంటామన్నారు. అర్హులైన లబ్ధిదారులు అందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో జీహెచ్ఎంసీ, జలమండలి ఏఈలు సదజా, రంజిత్, సరిత, చంద్రశేఖర్, బీఆర్ఎస్ నాయకులు కిషోర్, రామేశ్వర్‌గౌడ్, ఏఆర్ కృష్ణ, రాజసుందర్, నాగేశ్వర్ రావు, సునీల్‌ముదిరాజ్, శ్రీనివాస్‌గౌడ్, ఎం.మనోహర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ధర్నాకు మద్దతు తెలపండి

రామ్‌చందర్‌రావును కోరిన కేబుల్ ఆపరేటర్లు



లాలాపేట: ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా శనివారం ఇందిరాపార్కు వద్ద నిర్వహించనున్న ధర్నాకు మద్దతు తెలుపాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామ్‌చందర్‌రావును కేబుల్ ఆపరేటర్లు కోరారు. శుక్రవారం పలువురు కేబుల్ ఆపరేటర్లు తార్నాకలో రామ్‌చందర్‌రావును కలిసి మాట్లాడారు. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయంతో కేబుల్‌ను కట్ చేయడం వల్ల తాము తీవ్రంగా నష్టపోతున్నామని ఆయనకు వివరించారు. వినియోగదారులు సైతం ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. దీనిపై ప్రభుత్వం తక్షణమే స్పందించేలా ఒత్తిడి తీసుకురావాలని రామ్‌చందర్‌రావుకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో శివాజీ, ప్రభుగుప్తా తదితరులున్నారు.

డివిజన్‌లో సీసీరోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

రాంగోపాల్‌పేట్: ప్రజల అవసరాల అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. శుక్రవారం మోండా డివిజన్‌లో పర్యటించి రూ.కోటి 34 లక్షల వ్యయంతో మూడు చోట్ల చేపట్టనున్న సీసీరోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు వారి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ప్రధానంగా విద్యుత్ స్తంభాలపై కుప్పలుగా ఉన్న కేబుల్ వైర్లు, కిందకు వేలాడుతున్న వైర్లతో ప్రమాదం పొంచి ఉన్నదని ఎమ్మెల్యేకు విన్నవించారు. స్పందించిన ఆయన వెంటనే కేబుల్స్ తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో ఈ ప్రాంతంలో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నానని తెలిపారు. ప్రధానంగా మోండా డివిజన్‌లోని పజలు ఇబ్బందులకు గురవుతున్నట్లు గుర్తించామన్నారు. వారి సమస్యలను పరిష్కరించాలనే లక్ష్యంతో డ్రైనేజీ, స్ట్రామ్ వాటర్ లైన్‌లను నిర్మించామన్నారు. కార్యక్రమంలో డీసీ డాకు నాయక్, కార్పొరేటర్ కొంతం దీపిక, మాజీ కార్పొరేటర్ రూప, డీఈ మహేష్, వాటర్ వర్క్స్ డీజీఎం ఆశిష్, శానిటేషన్ డీఈ వెంకటేష్, ఎలక్ట్రికల్ ఏఈ వరలక్ష్మి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఆకుల హరికృష్ణ, నాయకులు తలసాని సైకిలాబ్ యాదవ్, నాగులు, రాములు, ఓదెల సత్యనారాయణ, జయరాజ్, మహేష్ యాదవ్, మహేందర్, హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ



ప్రభుత్వ బాలికల పాఠశాలలో విద్యార్థినులతో మాట్లాడుతున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్

బొల్లారం: తిరుమలగిరి వార్డు–7లోని లాల్‌బజార్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేశ్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులు తమకు కావాల్సిన మౌలిక వసతులు, ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఎమ్మెల్యే పాఠశాల ప్రాంగణం మొత్తం విద్యార్థినులతో కలసి పరిశీలించారు. అనంతరం 10వ తరగతి తరగతి గదులు, లైబ్రరీని సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు పాఠశాలలో సోషల్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్ పరికరాలు, నైపుణ్య అభివృద్ధి పుస్తకాలు, క్రీడా సామాగ్రి, వాలీబాల్ కోర్టు, మధ్యాహ్న భోజనం కోసం షెడ్డు వంటి మౌలిక వసతులను కల్పించాలని కోరారు.


- అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలు కూడా ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా అభివృద్ధి చెందాలన్నారు. పాఠశాలల అభివృద్ధికి అవసరమైన నిధులను కేటాయించడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాగినేని సరిత, మురళి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం

బొల్లారంలోని 7వ వార్డు తిరుమలగిరిలోని సర్దార్ పటేల్ కాలనీ చర్చి రోడ్, రోడ్ నం.4లో రాష్ట్ర ప్రభుత్వ నిధులతో రూ.21 లక్షల వ్యయంతో చేపడుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో మెరుగైన మౌలిక వసతుల కల్పనకు ఎన్ని నిధులైనా తెపిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాగినేని సరిత, మురళీ ముదిరాజ్, రేమండ్ హార్వుడ్, మేరీ, డెంజిల్, విజయ్, నరేష్, కాలనీ ప్రెసిడెంట్ లింగ మూర్తి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలి

అడ్డగుట్ట: ఆరోగ్యంగా ఉండడానికి అందరూ తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని చీఫ్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ నిర్మల అన్నారు. న్యూట్రీషన్ డే ను పురస్కరించుకొని శుక్రవారం లాలాగూడలోని కేంద్రీయ రైల్వే ఆస్పత్రిలో ఎన్ఐఎన్ ఆధ్వర్యంలో పౌష్టికాహారంపై రోగులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ రోగులు త్వరగా కోలుకొని ఆరోగ్యవంతంగా ఉండాలంటే క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. అంతే కాకుండా ప్రతీ ఒక్కరూ పోషక విలువలు కలిగి ఉన్న ఆహారాన్ని తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా అవుతారని చెప్పారు. చిన్న వయస్సు నుంచే పిల్లలకు పౌష్టికాహారం అలవాటు చేయాలని సూచించారు. అనంతరం, ఆస్పత్రిలో పెయింటింగ్, ప్లకార్డులతో పోషక విలువల గురించి ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు శివనాగ ప్రసాద్, రేణుక, కృష్ణవేణి, రాగిణి, నర్సింగ్ సూపరింటెండెంట్లు రేణుక, వసంతలు పాల్గొన్నారు.



లాలాగూడ రైల్వే ఆస్పత్రిలో న్యూట్రీషన్ డే కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు

మైనార్టీలకు అండగా కాంగ్రెస్

మంత్రి వివేక్ వెంకటస్వామి



మాజీ మంత్రి గీతారెడ్డిని సత్కరిస్తున్న మంత్రులు వివేక్, అడ్లూరి లక్ష్మణ్

రాంగోపాల్‌పేట్: మైనార్టీలకు కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ అండగా ఉంటుందని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. శుక్రవారం సికింద్రాబాద్ వైఎంసీఏలో వైఎంసీఏ ఇంటర్నేషనల్ ఇంటిగ్రేటెడ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ అండ్ మల్టీపర్పస్ ప్రోగ్రామ్ సెంటర్, శంకుస్థాపన నూతన ఆడిటోరియంను, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రిస్టియన్ మైనార్టీలకు సంక్షేమ పథకాలను సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తుందన్నారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు సముచిత స్థానం కల్పిస్తుందన్నారు. తాను మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత క్రైస్తవ మైనార్టీల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కలెక్టర్‌ను ఆదేశించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా వైఎంసీఏ ఆశ్రయ్‌కు చైర్మన్‌గా వ్యవహరించి సేవలు అందించిన మాజీ మంత్రి డాక్టర్ గీతారెడ్డిని అవార్డు జ్ఞాపికతో మంత్రులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్, క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ దీపక్ జాన్, వైఎంసీఏ అధ్యక్షులు జయకర్ డేనియల్, తెలంగాణ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వరరావు, మంత్రి అడ్లూరి సతీమణి అడ్లూరి శాంతికుమారి, కార్పొరేటర్ దీపిక, సుప్రీం కోర్టు న్యాయవాది జోయ్స్, బిషప్ సింగం, లెనార్డ్, తదితరులు పాల్గొన్నారు.

మోసపూరిత హామీ ఇచ్చిన కాంగ్రెస్



మాట్లాడుతున్న నరేంద్ర

బౌద్ధనగర్: దివ్యాంగులు, వృద్ధులు, వితంతువుల పెన్షన్లు పెంచుతామని మోసపూరిత హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా నిర్వహిస్తున్న ఎమ్మార్వో కార్యాలయాల ముట్టడిని జయప్రదం చేయాలని ఎంఎస్పీ జాతీయ నాయకులు సొట్ట నరేంద్ర పిలుపునిచ్చారు. శుక్రవారం పార్శిగుట్టలోని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి పెన్షన్‌దారులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులతో పాటు ఇతర చేయూత పెన్షన్లు పెంచుతామని, అదే విధంగా నూతన పెన్షన్లు కూడా మంజూరు చేస్తామని మాయమాటలు చెప్పి ప్రజలను మోసం చేసిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి స్థానిక సంస్థ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఇచ్చిన హామీ ప్రకారం పెన్షన్ పెంచాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 15న అన్ని ఎమ్మార్వో కార్యాలయాల ముట్టడి కార్యక్రమం చేపడుతున్నట్లు ప్రకటించారు. అప్పటికీ న్యాయం జరగకపోతే రాష్ట్రాన్ని ఉద్యమాలతో అట్టుడికిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు డప్పు మల్లికార్జున్, దయామణి, నాగమణి, సుజాత, వేణు గోపాల్, శివప్రసాద్, దేవేందర్, విజయ్, బాబు రావు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్–1 పరీక్షను మళ్లీ నిర్వహించాలని నిరసన



లాలాపేట: ఇటీవల వెలువడిన హైకోర్టు తీర్పుతో మరోసారి టీజీపీఎస్సీ నిర్లక్ష్య వైఖరి బహిర్గతం అయ్యిందని గ్రూప్–1 అభ్యర్థి, ఓయూ పరిశోధక విద్యార్థి ప్రభాకర్ చౌటి అన్నారు. గ్రూప్–1 పరీక్షను మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట పలువురు గ్రూప్–1 అభ్యర్థులు, నిరుద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రూప్–1 పరీక్ష నిర్వాహణలో అస్తవ్యస్థమైన పరిస్థితి, పక్షపాతం, పారదర్శకత లేమి, నిబంధనల ఉల్లంఘన తదితర అంశాలపై హైకోర్టు ఘాటైన వ్యాఖ్యలు చేసిందన్నారు. ప్రభుత్వం డివిజన్ బెంచ్‌లో అప్పీల్ వేయడం వలన గ్రూప్–1 ప్రక్రియ మరింత జాప్యం చేసే ప్రక్రియగా వారు పేర్కొంటున్నారు. ప్రభుత్వం భేషజాలకు పోకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. జీవో నెంబర్ 29ని రద్దు చేసి జీఓ నెంబర్ 55ను అమలు చేయాలన్నారు. తక్షణమే నూతనంగా పరీక్ష నిర్వహించి అభ్యర్థులకు న్యాయం చేయాలని విద్యార్థి సంఘాలు విజ్ఞప్తి చేస్తున్నాయి. ఈ కార్యక్రమంలో టీఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీకాంత్, పలువురు నిరుద్యోగ అభ్యర్థులున్నారు.



రూ.2కోట్లతో ఆధునాతన శ్మశానవాటిన



శ్మశానవాటిక పరిస్థితిని పరిశీలిస్తున్న కార్పొరేటర్

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి ప్రధాన రహదారిలోని శ్మశానవాటికను ఆధునాతన వసతులతో తీర్చిదిద్దేందుకు జీహెచ్ఎంసీ పరంగా చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ సామల హేమ చెప్పారు. శుక్రవారం జీహెచ్ఎంసీ ఏఈ కౌశిక్‌తో కలసి శ్మశానవాటికను ఆమె సందర్శించి అక్కడి పరిస్థితులను అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అవసరమైన స్నానపుగదులు, నీటిసరఫరా, షెడ్‌లు తదితర అన్ని ఆధునిక వసతులు కల్పించడం కోసం రూ.2 కోట్లతో అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్టు చెప్పారు. ఉన్నతాధికారుల ఆమోదం పొందగానే నిర్మాణం పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

రైలు నుంచి పడి వ్యక్తి మృతి



సికింద్రాబాద్: ప్రమాదవశాత్తు రైలులో నుంచి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. జీఆర్పీ కానిస్టేబుల్ పండరి తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ నుంచి జేమ్స్ స్ట్రీట్ రైల్వే స్టేషన్‌కు వెళ్లే మార్గం మధ్యలో సుమారు 45–50ఏళ్ల మధ్య వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి ప్రమాదవశాత్తు రైలులో నుంచి పడ్డాడు. ఈ క్రమంలో తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడు వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదని, బ్లూ కలర్ ఫుల్‌షర్ట్, బ్లూ కలర్ నైట్ ప్యాంట్ ధరించినట్లు పోలీసులు తెలిపారు.

బతుకమ్మ ఉత్సవ ఏర్పాట్లపై ఆదేశించండి



ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నేతలు

సనత్‌నగర్: బతుకమ్మ ఉత్సవాలు సమీపిస్తున్న నేపథ్యంలో తగిన ఏర్పాట్లపై అధికారులను ఆదేశించాలని బన్సీలాల్‌పేట డివిజన్‌కు చెందిన పలువురు బీఆర్ఎస్ నేతలు శుక్రవారం సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలసి వినతిపత్రం సమర్పించారు. ముఖ్యంగా బన్సీలాల్‌పేట డివిజన్‌లోని ఆలయాల వద్ద వాటర్ ఫౌంటెన్, లైటింగ్స్, శానిటైజింగ్ తదితర సౌకర్యాలు కల్పించాలని కోరారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ఆయా సదుపాయాలు కల్పించాలంటూ జీహెచ్ఎంసీ అధికారులకు తన పేరిట లేఖను సమర్పించాలని వారికి అందజేశారు. బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు వెంకటేషన్‌రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో యూత్ వింగ్ అధ్యక్షుడు కొత్తూరు వెంకటేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

హిందీ భాషకు అధిక ప్రాధాన్యత



సదస్సులో సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్లు

లాలాపేట: జాతీయ స్థాయిలో నిర్వహించే పోటీ పరీక్షల్లో హిందీ భాషకు అధిక ప్రాధాన్యత ఉందని కళాశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ రాజేందర్‌సింగ్ అన్నారు. శుక్రవారం ఓయూ ఆర్ట్స్ కళాశాలలో హిందీ విభాగం సౌజన్యంతో ఇబ్రహీం పట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల హిందీ విభాగం ఆధ్వర్యంలో 'వర్తమాన కాలంలో హిందీ భాష ఉపాధి అవకాశాలు–సవాళ్లు అనే అంశంపై ఒక్క రోజు యూజీసీ జాతీయ సదస్సును నిర్వహించారు. దీనికి ప్రొ. రాజేందర్ సింగ్ ముఖ్యఅతిథిగా హాజరై, హిందీ భాష ఉపాధి అవకాశాలపై ప్రసంగించారు. ఈ సందర్భంగా సావనీర్‌ను ఆవిష్కరించారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కాశీం మాట్లాడుతూ ప్రాథమిక విద్యా స్థాయి నుంచే హిందీ భాషపై పట్టుసాధించాలన్నారు. సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కృష్ణ ఈ సదస్సులో కీలక ఉపన్యాసం చేస్తూ జాతీయ స్థాయి పరీక్షల్లో రాణించడానికి విద్యార్థులు హిందీ భాషపై విస్తృత పరిజ్ఞానం అవసరం అన్నారు. ఈ సదస్సులో ఓయూ ఆర్ట్స్ కళాశాల హిందీ విభాగం హెడ్ ప్రొఫెసర్ మాయాదేవి, బిఓఎస్ ప్రొఫెసర్ సంగీత, ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాధిక, సదస్సు కన్వీనర్ డా.కె. మాధవి, వైస్ ప్రిన్సిపాల్ డా. నరేష్, అధ్యాపకులు చింతల రాకేష్, భవాని, డా. రమేశ్, కరుణ, ప్రసాద్, డా. గోపి, డా. అజయ్, డా. రాథోడ్, విద్యార్థులు పాల్గొన్నారు.